# జీవిత స్పర్శ

అమ్మాయి వేసిన ప్రశ్నకు ఆ గదిలోని వారంతా తలెత్తి చూశారు. ఆమె తండ్రి మాత్రం తలవంచుకున్నాడు. నిమిషం తర్వాత తలెత్తి తడిసిన తన కళ్ళను తుడుచుకుని కూతురివైపు చూశాడు.

'అప్పుడే పెళ్ళికళ వచ్చేసింది' అనుకున్నాడు తండ్రి.

పొడుగ్గా వేలాడుతున్న జడనిండా పువ్వులు గుచ్చేరు. 'కోలముఖం, సంపెంగలాంటి నాసిక, ఎప్పుడూ నవ్వుతూ ఉండే కళ్ళు అంతా అన్నపూర్ణ పోలికే' అనుకుంటూ నిట్టూర్చాడు తండ్రి.

ఆ ఇంట్లో పెళ్ళి సందడి మొదలయి పదిరోజులయింది. రెండు రోజుల క్రితం ఇంటిముందు నేరేడుకొమ్మ, పాలకొమ్మ కలిపి ముహూర్తపురాట వేశారు. మంచిముత్యం, పగడం, రాగి కాణి పసుపుగుడ్డలో చుట్టి ఆ కొమ్మలకు కట్టేరు. ఆ రాటచుట్టూ నవధాన్యాలు వేసారు. ఇవన్నీ చేయడానికి పెళ్ళి కూతురు అత్తలంతా వచ్చారు. బంధువులతో ఇల్లంతా సందడిగా ఉంది. అలాంటి ఉల్లాసకరమైన వేళలో పెళ్ళికూతురి మాటలు అందరికీ ఆశ్చర్యం కలిగించాయి. ఆమె వేళ్ళకు గోరింటాకు పెడుతున్న జానకి గబగబా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

"ఏంటమ్మా సరితా నువ్వనేది, చూశావా మీ అమ్మ మనసు ఎంత గాయపడిందో!" అన్నాడు కాంతారావు తన కూతురి తల నిమురుతూ.

"సరిత ఏం తప్పు మాట్లాడింది అన్నయ్యా... తన తల్లిని పెళ్లికి ఎందుకు పిలవడం లేదూ అంది ఆ తల్లి కడుపున పుట్టిన ఆమెకు అలా అడిగే స్వాతంత్ర్యం లేదా" అంది కాంతారావు చెల్లెలు.

"ఇన్నేళ్ళ తర్వాతా? ఇరవయ్యేళ్ళ క్రితం వదలుకున్న మనిషిని ఇపుడు

పెళ్ళికి పిలవనా? ఆవిడను పెళ్ళికి తీసుకొస్తే జానకి ఏమనుకుంటుంది?" అన్నాడు కాంతారావు.

"ఏమీ అనుకోను తీసుకురండి" అంది జానకి బాత్ రూమ్‌లో ముఖం కడుక్కుని వచ్చి.

కాంతారావు భార్య ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు. క్షణం క్రితం బాధపడినట్టు కనిపించి వెంటనే మామూలు మనిషయింది జానకి. సరితను గుండెల్లో పెట్టుకుని పెంచింది ఇన్నేళ్ళు. "ఇంతకీ ఏమం టావ్?" అన్నాడు తలొంచుకుని ఉన్న కూతురిని చూస్తూ.

"సారీ నాన్నా నీ మనసు కష్టపెడితే! అమ్మను చూడాలని ఉంది. అలాగే పెళ్ళికి అమ్మ ఉంటే బావుంటుంది" అంది, అంతక్రితం జానకి పిన్ని వేసిన గోరింటాకు చూసుకుంటూ.

"ఆమెతో ఏడడుగులు నడిచి, నాతిచరామి అంటూ అగ్ని హెూత్రం చుట్టూ ప్రదక్షిన చేసి అర్థాంతరంగా వదిలేశాను, నాలాంటి దుర్గార్గుడిని ఆమె క్షమించి నీ పెళ్ళికి వస్తుందా?" అన్నాడు కాంతారావు బాధగా.

"ఇందులో నీ తప్పేముంది నాన్నా, నా కోసమేగా అమ్మను వదిలేశావ్" అంది సరిత.

ఆమె మాటలతో కాంతారావు మనసునిండా దిగులు మేఘం కమ్ముకుంది. ఒక్కసారిగా ఇరవయ్యేళ్ళ క్రిందటి జ్ఞాపకాల్లోకి జారుకున్నాడు.

* * *

తను కొత్తగా ఉద్యోగంలో చేరటానికి ఆ ఊరు వెళ్ళాడు. ఒక ప్రాథమిక పాఠశాలలో ఏకోపాధ్యాయుడిగా ఉద్యోగం. విజయనగరం దగ్గర ఒక పల్లెటూరు. ఉదయం కాకినాడలో బయలుదేరి ఆ ఊరు చేరేసరికి మధ్యాహ్నం అయింది. బాగా అలసిపోయాడు. స్కూలు తలుపు తెరచి బల్లమీదే

నిద్రపోయాడు. మెలకువ వచ్చేసరికి సాయంత్రం అయింది. పల్లెటూళ్ళల్లో ఎవరో ఒకరు తమలాంటి వారికి భోజనం ఏర్పాటు చేస్తారని విన్నాడు. అయినా తను మొహమాటస్తుడు. స్కూలుకు తాళంవేసి, ఏదైనా హెూటలు కనిపిస్తుందే మోనని మెల్లగా నడుస్తున్నాడు.

ధ్వని కాలుష్యం లేకుండా ప్రశాంతంగా ఉన్న ఆ పల్లె వాతావరణం నచ్చడంతో మెల్లగా నడవడం మొదలుపెట్టాడు. చుట్టూ ఆవరించుకుంటున్న పల్చటి చీకటి తెరలు. నక్షత్రాల వెలుగుతప్ప ఆ ఊళ్ళో వీధిదీపాలు వెలగడం లేదు. కొంత దూరం నడిచేసరికి మధ్యాహ్నం నుంచీ ఏమీ తినలేదనే విషయం గుర్తొచ్చి ఆకలి, నీరసం ఏకకాలంలో కలిగాయి.

ఇంతలో అతడిని దాటుకుంటూ ఒక అమ్మాయి ముందుకు వెళ్లి పోయింది. వెంటనే అడిగాడు. "ఈ ఊళ్ళో భోజన హెూటల్ ఎక్కడుం దండీ!" అని.

అతడి మాటలకు ఆమె వెనక్కి తిరిగింది నక్షత్రమండంలోని ఒక తార నేలకు దిగినట్టనిపించింది. కాంతారావుకు ఆమెను చూడగానే, అందం. అమాయకత్వం, అణకువ కలబోసినట్టుగా తోచింది.

వెంటనే అతడితో అంది "ఇది పల్లెటూరు, భోజనశాలలు ఉండవు, ఒక పూటకూళ్ళమ్మ ఉంది. ఆవిడకు ముందుగా చెప్పాలి. ఇంతకీ మీరు ఈ ఊరుకు కొత్తా?"

"ఔను! ఈ ఊళ్ళో కొత్తగా స్కూల్లో ఏకోపాధ్యాయుడుగా అంటే సింగిల్ టీచర్‌గా చేరడానికి వచ్చాను" అన్నాడు కాంతారావు.

"నాతోరండి" అంటూ ముందుకు నడిచింది ఆమె. ఆమెను కాంతా రావు అనుసరించాడు. రెండు వీధులు తిరిగి ఒక పాత పెంకుటింట్లోకి నడిచింది. కుర్చీ తీసుకొచ్చి ఇంటి అరుగుమీద వేసింది. పావుగంట తర్వాత

ఒక యాభయ్యేళ్ళ ఆవిడ వచ్చి, "ఒక ఐదు నిమిషాలు ఆగండి" అంటూ లోపలకెళ్ళి పోయింది.

'ఏమిటీ, తనను ఈ ఇంటి అరుగుమీద ఇంతసేపు కూర్చో బెట్టారు, పూటకూళ్ళమ్మ ఇల్లు ఎక్కడో చూపించకుండా' అనుకునేంతలో ....

అతడిని తీసుకు వచ్చిన అమ్మాయి "రండి" అంటూ లోపలకు తీసుకు వెళ్ళింది.

లోపలి గదిలో పీట వేశారు. చేతులు కడుక్కోవడానికి నీళ్ళిచ్చారు. విస్తరివేసి వేడి అన్నం, పప్పు, కూర వడ్డించారు. బాగా ఆకలిగా ఉండడంతో మౌనంగా భోజనం ముగించాడు ఆకలితీరి స్థిమితపడిన తర్వాత ఆ అమ్మాయి మంచితనం అతడికి అర్థమయింది. 'ఆకలిగా ఉంది' అన్న తనను పిలిచి భోజనం పెట్టింది.

ఆ విధంగా అన్నపూర్ణతో తనకు పరిచయం, ఆ పరిచయం మరింత పెరిగింది. ఆమె గురించిన వివరాలు తెలిశాయి. ఆమె తండ్రి ఆ ఊరి షావుకారి వద్ద పద్దులు రాసేవాడట. ఒక రోజు పట్నం వెళ్ళి సైకిలు మీద తిరిగి వస్తుంటే, లారీ గుద్దెయ్యడంతో ఆయన హఠాన్మరణంలో ఉన్న కుటుంబ ఆధారం పోయింది. ఆ పాత పెంకుటిల్లు తప్ప వేరే ఆస్తి లేదు. అన్నపూర్ణ సంగీతపాఠాలు చెపుతుంది. ఆమె తల్లిగారు అప్పడాలు, వడియాలు చేసి ఇస్తే అన్నపూర్ణ వాటిని తెలిసిన వారి ఇళ్ళకు తీసుకు వెళ్ళి అమ్ముతుంది.

అలాంటి స్థితిలో అన్నపూర్ణ పెళ్ళి జరగడం ఆమె తల్లిగారికి కలలోని మాటే! కాంతారావు తను ఆమెను పెళ్ళిచేసుకోవడానికి ముందుకు రాగానే బాగా సంతోషించిన వ్యక్తి ఆమె తల్లి. అన్నపూర్ణను చూడగానే అమ్మ. నాన్న వెంటనే ఒప్పేసు కున్నారు. అన్నవరంలో చాలా సామాన్యంగా తమ పెళ్ళి అయిపోయింది. రెండేళ్ళపాటు తమ వైవాహిక జీవితం హాయిగా గడిచింది.

తమకో పాప పుట్టింది. ఆ అమ్మాయికి సంవత్సరం వయసపుడు అన్నపూర్ణ కంగారుగా బాత్‌రూమ్‌లోంచి బైటికొచ్చింది.

"ఏవో తెల్లగా పాలిపోయినట్టున్న మచ్చలు, ఒంటిమీద అక్కడక్కడా ఉన్నాయి. నెలక్రితం చూశాను. ఏదన్నా పురుగు కుట్టిందేమో అనుకున్నాను... ఇంకా ఎక్కువయ్యాయి" అందామె కంగారుగా.

కాంతారావు ఆ రోజే భార్యను ఆ ఊరికి దగ్గరలోని టౌనులో ఒక స్కిన్ స్పెషలిస్టు దగ్గరకు తీసుకెళ్ళాడు ఆ మచ్చలు ఉన్న ప్రాంతంలో చిన్న పరికంతో నొక్కి "ఎలా ఉందమ్మా?" అని అడిగాడు

"అబ్బే! ఏమీ తెలియడం లేదండీ" అంది అన్నపూర్ణ.

మళ్ళీ రెండోసారి కొంచెం గట్టిగా గుచ్చాడు.

"అబ్బే! స్పర్శ లేదండీ!" అంది అన్నపూర్ణ.

వెంటనే ఆ డాక్టరు అన్నపూర్ణ ముఖంలోకి జాలిగా చూసి, "పరీక్షలు చేయించి రిపోర్టులు తీసుకుని రెండు రోజుల తర్వాత రండి" అన్నాడు.

రెండు రోజుల తర్వాత పరీక్షల అనంతరం ల్యాబ్ రిపోర్టులు తీసుకుని తనొక్కడే డాక్టరు దగ్గరకు వెళ్ళాడు. ఆయన ఆ రిపోర్టులు చూసి చెప్పిన మాటలతో తన గుండె ఆగినట్టయింది.

"సారీ కాంతారావుగారూ మీ ఆవిడకు లెప్రసీ వ్యాధి సోకింది. రెండు రకాలయిన వ్యాధుల్లో ఇది రెండోరకం, బాగా ఎక్కువకాలం దగ్గరగా కలసి ఉంటే మిగతా వారికీ వస్తుంది. జాగ్రత్తగా ఉండండి" అన్నాడు స్కిన్ స్పెషలిస్ట్.

అలా తను ఎంతో ప్రాణప్రదంగా ప్రేమించిన అన్నపూర్ణకు దూరం అయ్యాడు. ఆ ఊళ్ళోనే తనూ, పాప ఇద్దరూ వేరే ఇల్లు తీసుకొని ఉండేవారు. అన్నపూర్ణ తన పాప కోసం ఏడ్చేది. అయినా ఆమెను దగ్గరకు రానిచ్చేవాడు

కాదు కాంతారావు. కూతురి పరిస్థితి అలా అయినందుకు అన్నపూర్ణ తల్లి బెంగపెట్టుకుని దిగులుతో మంచం పట్టింది. ఆరు నెలల తర్వాత ఆమె అన్నపూర్ణను, ఒంటరిదాన్ని చేసి తన భర్తను చేరుకుంది.

తన తల్లి, తండ్రీ తనను వేరే ఊరుకు బదిలీ చేయించుకోమని సలహా ఇచ్చారు. ఊళ్ళో ఉంటే అన్నపూర్ణ తరచూ పాప దగ్గరకు వస్తుందని వాళ్ళ భయం. తల్లిదండ్రుల మాటలు శిరసావహించాడు. బదిలీ ప్రయత్నాలు ఫలించాయి. కూతురిని తీసుకొని తన స్వంత ఊరయిన కాకినాడకు దగ్గర లోని ఒక పల్లెటూళ్ళో ఉద్యోగంలో చేరాడు.

నెలనెలా అన్నపూర్ణకు ఆమె ఖర్చులకోసం డబ్బులు పంపేవాడు. అలా రెండు నెలలు సాగింది. మూడో నెలలో ఆమెకు పంపిన మనిఆర్డర్ తిరిగొచ్చేసింది. అతడికి ఆశ్చర్యం వేసి, వెంటనే ఆ ఊరు బయలుదేరాడు. ఆ ఊళ్ళో అన్నపూర్ణ లేదు. ఆ ఊళ్ళోని ఆ పాత పెంకుటిల్లు అమ్మేసి ఎక్కడికో వెళ్ళిపోయిందట. ఆమె అడ్రసు ఎవరికీ తెలీదు. తన పేపరులో ప్రకటన ఇచ్చాడు. ఆమె కోసం ఎంక్వయిరీ జరిపాడు. అయినా ఆమె ఆచూకీ లేదు. సంవత్సరం తర్వాత తల్లిదండ్రుల బలవంతం మీద జానకిని రెండో పెళ్ళి చేసుకున్నాడు.

ఇది ఇరవయ్యేళ్ళ క్రిందటి సంగతి. జానకి కూతురిని స్వంత బిడ్డలాగే చూసుకుంది. తమకు పిల్లలు పుట్టలేదు. అన్నపూర్ణ గురించి తనకు కొద్దిగా సమాచారం తెలిసినా తను ఆమెను కలిసేందుకు ప్రయత్నాలు చెయ్యలేదు. తన కూతురికీ ఈ మధ్యనే తన కన్నతల్లి గురించిన చేదునిజం తెలిసింది. అందుకే ఆమెను పెళ్ళికి తీసుకురావాలని పట్టుబడుతోంది.

* * *

ఆలోచనలో ఉన్నవాడల్లా కూతురి మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు. “నాన్నగారు! మనం రేపు ఉదయమే అమ్మ ఉంటున్న ఊరు బయలు దేరుదాం” అంది సరిత.

"అలాగేనమ్మా!" అంటూ గబా గబా బైటికి నడిచాడు కాంతారావు ఆ ఊరికి ఎలా చేరుకోవాలో తెలుసుకునేందుకు బస్టాండుకు బయలు దేరాడు.

తరువాతిరోజు ఉదయం కాకినాడలో బస్సెక్కారు ఆ తండ్రీ కూతుళ్ళు. శ్రీకాకుళం చేరేసరికి మధ్యాహ్నం అయింది. అక్కడ నుంచి ఆ ఊరు చేరేసరికి చీకటి పడింది. అది ఒరిస్సాకు సరిహద్దు గ్రామం. బస్సు దిగగానే తనముందు నడుస్తున్న ఒక తెల్లబట్టలు వేసుకున్న వ్యక్తిని అడిగారు అన్నపూర్ణ ఉంటున్న అడ్రసు గురించి 'రండి' అంటూ అతను ముందుకు కదిలాడు.

శీతాకాలపు చలి. ఇంకా నగరపు వాసన సోకని ఆ పల్లెటూరి మట్టి రోడ్డుపై మౌనంగా నడుస్తున్నారు తనూ, కూతురూ. వారి మౌనాన్ని భగ్నం చేస్తూ, "ఇంతకూ మీకు ఆవిడతో ఏం పని?" అన్నాడు దారి చూపిస్తున్న వ్యక్తి.

అతడి మాటలకు ఏం సమాధానం చెప్పాలో తెలీక మౌనంగా ఉండి పోయాడు కాంతారావు. అయినా ఏం సమాధానం చెబుతాడు? ఇరవయ్యేళ్ళ క్రితం వదిలేసిన తన సహధర్మచారిణిని వెతుక్కుంటూ బయలుదేరానని చెప్పాలా? ఘోరమైన జబ్బుతో ఉన్న ఆమెను ఏకాకిలా వదిలేసి ఇన్ని సంవత్సరాల తర్వాత కలవడానికి వెళుతున్నానని చెప్పాలా? ఏం చెప్పాలి? మనసులో కలుగుతున్న అనేకానేక ప్రశ్నలకు తనకు తాను జవాబు చెప్పుకోలేక దిగులుగా మాటలు రాని మూగవాడిలా ముందుకు నడుస్తున్నాడు కాంతా రావు. వారు మాట్లాడక పోవడంతో ఆ తెల్లబట్టల వ్యక్తి తానే నోరు విప్పాడు.

"ఆఫ్రికాలో మొరాకో అనే ఒక దీవి ఉంది. ఆ దీవిలోని వారికి కుష్ఠువ్యాధి సోకడంతో అక్కడ పుట్టిన పిల్లల్ని వేరే ప్రాంతాలకు తరలించే వారట. ఆ విధంగా మొరాకో దీవి పసిపాపలు లేని దేశం అయింది. ఆ దీవిలో కుష్ఠువ్యాధి రోగుల పాలిట దేవుడు ఫాదర్ డేమియన్. ఆ మహాను

భావుడు ఆ రోగులకు సేవ చేస్తూ తనూ ఆ వ్యాధి బారిన పడ్డాడట! సరిగా ఆ మొరాకో దీవిలాంటిదే ఇపుడు మనం వెళ్ళబోతున్న ఊరు. ఆ ఊళ్ళో కుష్టువ్యాధి పీడితులు ఎక్కువ. వారికోసం పునరావాస కేంద్రం ఏర్పాటు చేసింది అన్నపూర్ణమ్మతల్లి. తనలాగా కుష్ఠు వ్యాధి సోకిన వారికోసం ఇరవయ్యేళ్ళుగా ఇక్కడే ఉంటోంది."

ఆ తెల్లబట్టల మనిషి మాటలకు ఆ తండ్రీ, కూతుళ్ళిద్దరూ ఏమీ మాట్లాడకుండానే వింటూ నడుస్తున్నారు. అరగంట తర్వాత ఆ ఊరు చేరారు. ఊరు మొదట్లోనే ఆ బోర్డు కనిపించింది. "కుష్ఠురోగుల పునరావాసకేంద్రం" అంటూ గట్టిగా చదివాడు కాంతారావు.

చుట్టూ ప్రహారీగోడ, బైట పెద్ద గేటు. లోపలకు వెళ్ళేసరికి చిన్న చిన్న పర్ణశాలల్లా కట్టిన ఇళ్ళు. పూలమొక్కలు, బాగా పెరిగిన చెట్లతో ఆ ఆవరణ అంతా పచ్చగా కనిపిస్తోంది. మరికొంత దూరం నడిచేసరికి ఒక పెంకుటిల్లు, బైట చెట్టు క్రింద కుర్చీలో కూర్చున్న ఒక మధ్యవయస్కురాలు, తెల్లటి బట్టల్లో కనిపించింది. ఆమెకు ఎదురుగా ఇరవై మందికి పైగా ఆడవాళ్ళు కూర్చుని అందవిహీనమైన తమ చేతుల్లోంచి అందమైన ఆకృతి కలిగిన బుట్టలు అల్లుతున్నారు.

ఆమెను చూసి ఆశ్చర్యంగా, ఆనందంగా, "అన్నపూర్ణా!" అన్నాడు కాంతారావు. ఆమె అతడి వంక చూసింది. నిర్మలంగా నవ్వింది. సరిత "అమ్మా...!" అంటూ ముందుకు వెళ్ళింది.

ఒక్కక్షణం అన్నపూర్ణ కూతురివంక పరిశీలనగా చూసి "రామ్మా!" అంటూ దగ్గరకు పిలిచి... "బాగా పెద్దదానివయ్యావ్, నాకు అన్ని విషయాలు తెలుస్తూనే ఉన్నాయి" అంటూ దగ్గరకు తీసుకుని తల నిమిరింది.

"అమ్మా నా పెళ్ళి ఇంకా నాలుగురోజుల్లో, నువ్వు తప్పక రావాలి. ఇక నుంచీ నువ్వు మాతోనే ఉండి పోవాలి" అంది సరిత ఏడుస్తూ.

"లేదమ్మా! నా అవసరం వీళ్ళకు ఉంది, నీకు అమ్మ, నాన్న ఉన్నారు. వీళ్ళకెవరూ లేరు?" అంటూ అన్నపూర్ణ గబగబా ఆ పెంకుటింట్లోకి వెళ్ళింది.

వెళుతున్న ఆమె వైపే చూస్తూ ఉండిపోయారు కాంతారావు, సరిత, ఐదు నిమిషాల తర్వాత అన్నపూర్ణ తిరిగొచ్చింది. ఆమె చేతిలో ఒక పాకెట్టు. దాన్ని కూతురికి ఇస్తూ, "ఇది నీ పెళ్ళికి నేనిచ్చే బహుమతి, నీకు అంతా శు భమే జరుగుతుంది. ఇక వెళ్ళిరండి...!" అంటూ తను అంతవరకూ కూర్చున్న చోటు వైపు కదిలింది.

ఇక చేసేది ఏమీలేక కాంతారావు. కూతుర్ని తీసుకుని అక్కడ నించి ముందుకు నడిచాడు.

నడుస్తున్న సరిత వెనక్కి తిరిగి తల్లివైపు చూస్తూనే ముందుకు కదిలింది. ఆ ఆవరణ దాటే వరకూ తల్లిని చూస్తూనే ఉంది.

ఆ ఇద్దరూ ఆ పునరావాస కేంద్రం గేటు దాటి బైటకొచ్చారు. సరిత తన తల్లి ఇచ్చిన పాకెట్టు విప్పింది. ఆ పాకెట్టులోంచి సరిత తీసిన బొమ్మను చూసి కాంతారావు ఆశ్చర్యపోయాడు.

ఒక మాతృమూర్తి తన పాపకు పాలుపడుతున్న ఒక అందమైన బొమ్మ అది. అది ఇరవయ్యేళ్ళ క్రితం అన్నపూర్ణ సరిత మొదటి పుట్టిన రోజున కొన్నది. 'పేగుతెంచుకుని పుట్టిన కూతుర్ని వదిలి ఇన్ని సంవత్సరాలు ఎలా బతికిందో, ఆ బొమ్మను దాచి ఉంచడంలోనే అర్థమవుతోంది' అనుకుంటూ కాంతారావు దుఃఖపడ్డాడు.

స్పర్శలేదని తను అన్నపూర్ణను వదిలేశాడు. ఆమెకు జీవితం గురించిన స్పర్శ ఉంది. అది తనకు లేక ఇన్ని సంవత్సరాలు ఆమెకు దూరం మయ్యాడు. అసలింతకీ ఆ జబ్బు వచ్చింది తనకేనేమో! అనుకుంటూ మూగగా రోదిస్తూ నడుస్తున్నాడు కాంతారావు.

*(ధ్యానమాలిక మే 2009)*